క్లుప్తంగా

సమస్యలపై అర్జీలను వెంటనే పరిష్కరించాలి



మాచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేట నుంచి వీడియో సమావేశంలో తహసీల్దార్లు, పురపాలక సంఘ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన మాట్లాడారు. ఆయా ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం



రెంటచింతల: బాల్య వివాహాలతో ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు వారి జీవితాలు నాశనం అవుతాయని పల్నాడు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు అన్నారు. కిశోరి వికాసం ప్రత్యేక వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పాలువాయిలో ఆయన బాలికలు, అంగన్‌వాడీ సిబ్బందితో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలురతో సమానంగా బాలికలు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. వ్యాయామం, ఆటల వల్ల శారీరక దారుఢ్యం తోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెంటచింతల -2 సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

అర్చకుడు దుర్గాప్రసాద్ మృతి బాధాకరం: కాసు

గురజాల రూరల్: దైదలోని శైవ క్షేత్రం అర్చకుడు దుర్గాప్రసాద్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. అతి చిన్న వయస్సులోనే అనారోగ్యంతో దుర్గాప్రసాద్ మృతి చెందడం కలచి వేసిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

'చలో వరంగల్'ను విజయవంతం చేయాలి

విజయపురి సౌత్: రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును తీసుకుని మంద కృష్ణ మాదిగ మంగళవారం 31న వరంగల్‌కు వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'చలో వరంగల్'ను విజయవంతం చేయాలని ఎంఎస్పీ మాచర్ల మండల అధ్యక్షుడు ఊరే మార్క్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డిపర్తి శ్రీనివాసరావు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం విజయపురిసౌత్‌లో పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు వరంగల్‌కు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాగార్జునసాగర్ అధ్యక్షుడు ఊరే మధుమాదిగ, ఎంఎస్పీ నాగార్జునసాగర్ అధ్యక్షుడు మీసాల దానియేలు మాదిగ, సిద్దెల దానియేలు మాదిగ, బి. నాగేశ్వరావు మాదిగ పాల్గొన్నారు.

బీమా సౌకర్యాలు సద్వినియోగం చేసుకోండి



శావల్యాపురం: అర్హత కలిగిన బ్యాంకు ఖాతాదారులు బీమా సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు) మేనేజరు వలేటి శివకృష్ణ అన్నారు. సోమవారం శావల్యాపురం బ్రాంచ్ శాఖ పరిధిలో బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన ఆరుమళ్ల లక్ష్మయ్య గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన బ్యాంకులో ప్రమాద బీమా యోజన పథకంలో సభ్యత్వం నమోదు చేసుకోవటం వల్ల శ్రీరామ జనరల్ ఇన్సూరెన్సు సంస్థ ద్వారా రూ. 2 లక్షల చెక్కును నామిని ఆరుమళ్ల సామ్రాజ్యానికి బ్రాంచ్ మేనేజరు శివకృష్ణకు అందజేశారు. బ్యాంకులో ఖాతా ఉన్న వారంతా ప్రమాదవశాత్తు మృతి చెందితే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బాధిత కుటుంబ సభ్యులు బ్యాంకు అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్సు ప్రతినిధి యం.కోటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ నెహ్రూ, దిలీప్‌కుమార్, రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల అవసరాలపై దృష్టి పెట్టాలి

ఎంపీడీఓ సరోజినీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరోజినీదేవి

రెంటచింతల: గ్రామాల్లో ప్రజల అవసరాలపై, వారి సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ కె. సరోజినీదేవి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమష్టిగా పని చేసినప్పుడే గ్రామాల్లో సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రజలకు క్షేత్రస్థాయిలోనే మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యదర్శులంతా గ్రామస్తులకు అందుబాటులో ఉండాలని. రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చ్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, ఎంఈఓ వై. శివనాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ సీహెచ్. శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్, గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఓ చిన వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు లావు రత్నాకర్‌రావు, డేగల దానియేలు, మాచర్ల అచ్చమ్మ, గుంటా ముక్కంటేశ్వరరెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముదిరాజుల శ్మశానవాటిక సమస్యకు పరిష్కారం



కొలతలు వేస్తున్న రెవెన్యూ అధికారులు

దాచేపల్లి : నడికుడి సచివాలయం సమీపంలో ఆక్రమణకు గురైన ముదిరాజుల శ్మశానవాటిక సమస్య ఎట్టకేలకు సోమవారం పరిష్కారమైంది. ఇటీవల పిడుగురాళ్లలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సమస్యను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి ముదిరాజులు తీసుకెళ్లారు. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కె.వి.కుటుంబరావుని ఆదేశించారు. మండల, గ్రామ సచివాలయం సర్వేయర్ల ద్వారా సర్వే చేయించారు. రికార్డుల ప్రకారం కేటాయించిన 45 సెంట్లకు హద్దులు గుర్తించారు. శ్మశాన స్థలం గుర్తించి అప్పగించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే యరపతినేని, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకి ముదిరాజులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజుల సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు నర్రా పుల్లయ్య, గొల్ల నారాయణ, బుల్లెబ్బాయి, శ్రీరాములు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



రెంటచింతల: ఎస్టీయూ పల్నాడు జిల్లా కౌన్సిలర్ లేళ్ల శ్రీనివాసరావు తన తండ్రి పేరయ్య జ్ఞాపకార్థం సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని తహసీల్దార్ దొప్పలపూడి మేరి కనకం తెలిపారు. ఆమె సోమవారం ఎంఈవో -2 వై.శివనాగేశ్వరరావుతో కలసి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రెంటచింతల మండలానికి పేరయ్య చేసిన సేవలను ఆమె గుర్తు చేసి, కొనియాడారు. కార్యక్రమంలో దండె శివయ్య, కావూరి నాగయ్య, బొబ్బ సుంకయ్య, గోలి నాగేశ్వరరావు, నారాయణపురం శ్రీనివాసరావు, పాస్టర్ ఐజాక్, మూలి రాజారెడ్డి, బోయిన నాగిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాపరిషత్‌ల కృషి ఎనలేనిది



కళాకారులను సన్మానిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు, న్యాయవాది శ్రీనివాసరావు



కళా ప్రదర్శనల నాటికలో ఓ భాగం

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతు లూరు గ్రామంలో నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయ నాటికల పోటీలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎమ్మెల్యే సోదరుడు డాక్టర్ సీహెచ్ ఫణీంద్రబాబు, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు హాజరయ్యారు.కళాకారులు సూరయ్య, వంకాయలపాటి చెన్నకేశవ, సుబ్బారావులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక, పౌరాణిక నాటకాలకు పూర్వ వైభవం దక్కేలా కళాపరిషత్‌లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కళాకారులకు జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించారు.

ఆకట్టుకున్న నాటికలు...

బాపట్ల సహృదయ ద్రోణాదుల ఆధ్వర్యంలో 'వర్క్‌ఫ్రం హోమ్' నాటికకు రచయితగా అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకుడిగా మహేంద్ర వ్యవహరించారు. సాతులూరు వజ్ఞా రామనాథం ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'రారాజు సుయోధన' పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. దర్శకత్వం వజ్ఞా మధుసూదనరావు వ్యవహరించారు. వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'ఏకాకి' నాటికకు రచయితగా నాగేశ్వరరావు, దర్శకుడిగా ఖాజీపేట తిరుమలయ్య వ్యవహరించారు.

నేటి ప్రదర్శనలు

హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'అమ్మ చెక్కిన బొమ్మ', న్యూఢిల్లీ వారి 'అనశ్వరం', చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'మా ఇంట్లో మహాభారతం' నాటిక ప్రదర్శనలు జరగనున్నట్లు నిర్వాహకులు, కళాపరిషత్ సభ్యులు తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత



పిడుగురాళ్ల: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వైద్యాధికారిణి డాక్టర్ మేఘమాల అన్నారు. పట్టణంలోని ఆయుర్వేద వైద్యశాలలో సోమవారం యోగాంధ్ర రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేఘమాల మాట్లాడుతూ యోగా చేయడం వల్ల వ్యాధుల నుంచి రక్షణతో పాటు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. చక్కని ఆరోగ్యం పొందాలంటే తప్పనిసరిగా యోగా చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను రైతులకు తెలియచేయండి

కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి



మాట్లాడుతున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలోని రైతులకు కేంద్రం ద్వారా అందుతున్న ప్రయోజనాలను విరివిగా ప్రచారం చేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి పేర్కొన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై చర్చించారు. కుమారస్వామి మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీజేపీ మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకుని వెళ్లాలని తెలిపారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ, రైతు భరోసా విధానాన్ని గ్రామానికి ఐదుగురు టీంలాగా ఏర్పాటై రైతులకి జరుగుతున్న మేలు గురించి తెలియజేయాలని కోరారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కిశోర్ మాట్లాడుతూ ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేసే విధానం, గిట్టుబాటు ధర ఇవ్వడానికి ఆలోచిస్తున్న విధానాన్ని వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి హరిశ్చంద్రారెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరు శశికుమార్, జిల్లా ఇన్‌చార్జి కుక్కర శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కామినేని హనుమంతరావు, కేతన బోయిన హనుమంతరావు, విజయకుమార్, అంజిరాజు పాల్గొన్నారు.

5 లోగా ఆధార్ అనుసంధానం చేసుకోండి

నరసరావుపేట టౌన్: సంక్షేమ పథకాల బదిలీ కోసం బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి తెలిపారు. సోమవారం పోస్టల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకేజ్ చేయుటం తప్పనిసరి అని, అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సిబ్బందిని సూచించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు నేరుగా బ్యాంక్ ఖాతాకు జమ చేయడానికి ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో సుమారు 51 లక్షల మందికి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ లేని కారణంగా సంవత్సరంలో జీఎస్‌డబ్ల్యూఎస్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొంత పురోగతి సాధించారన్నారు. అయినప్పటికీ లబ్ధిదారుల్లో చాలా మందికి ఆధార్ అనుసంధానం కాలేదు అన్నారు. ఈ క్రమంలో తపాలా శాఖ, సచివాలయ యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీ లోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ప్రారంభం చేస్తామని తెలిపారు. తద్వారా సంక్షేమ పథకాలు ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మహేంద్ర రాష్ట్ర సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



నూతనంగా ఎంపికైన జొరిగె మస్తాన్‌రావు, సభ్యులను అభినందిస్తున్న సంఘం సభ్యులు

వినుకొండ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహేంద్ర (మేదరి) సంఘం నూతన ప్రమాణ స్వీకార మహోత్సవం పట్టణంలోని గంగినేని కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జొరిగె మస్తాన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పోలేపల్లి నాగేంద్ర, కోశాధికారిగా సిరిగి మంగారావు, ప్రచార కార్యదర్శిగా పిల్లి మాణిక్యాలరావు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు అనుబంధ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మేదరి సంఘాల ముఖ్య నాయకులు పాల్గొని, నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా జొరిగె మస్తాన్‌రావు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో తమ కులం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మినహాయించి ఎస్సీ, ఎస్టీల్లో ఉన్నదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తమను ఎస్టీల్లో చేర్చవలసిందిగా ఆయన డిమాండ్ చేశారు. తమ సొసైటీలను మరలా ఏర్పాటు చేయాలని, వెదురుతో తయారు చేసే వస్తువులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. తమ కులాన్ని ఎస్టీలో చేర్చి, సబ్సిడీపై వెదురు సప్లయ్ చేయాలని ఆయన విన్నవించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, బాబు, డి.ఏసుబాబు, ఎస్.హనుమాన్ ప్రసాద్, జొరిగె శ్రీనివాసరావు, కె. వెంకట్ రాయుడు పాల్గొన్నారు.

నేడు వేసవి శిక్షణ శిబిరం ముగింపు

యడ్లపాడు: నెలరోజులు పాటు నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణ శిబిరం మంగళవారంతో ముగుస్తుందని బాసట సామాజిక, సాంస్కృతి వేదిక సంస్థ ప్రతినిధులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, డీఐఈవో ఎస్ఎం సుభాని, ఎంఈవోలు ఎంవీ నాగరత్నం, ఎం.అరుణకుమారి, ఎస్ఐ టి.శివరామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ముగింపు సభలో శిక్షణ పూర్తి చేసుకుని, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, బాసట సంస్థ స్కాలర్‌షిప్ టెస్టులో ప్రతిభ ను చూపిన పదో తరగతి విద్యార్థులు ఐదుగురికి రూ.1.20 లక్షల ఉపకార వేతనాల చెక్కులు అందజేయనున్నట్లు తెలిపారు. శిబిరంలో స్వచ్ఛందంగా సేవలు అందించిన ఉపాధ్యాయులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులను అభినందించనున్నట్లు వివరించారు. దాతలు, అధికారులు, స్థానిక పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరవుతారని బాసట విద్యావిభాగం కన్వీనర్ కల్లూరి శ్రీనివాస్ (వాసు), అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు, కార్యదర్శి సామినేని వెంకటేశ్వర్లు (శ్రీను), కోశాధికారి కేతా రామబ్రహ్మం వెల్లడించారు.

పట్టణ ఎంఎస్ఎఫ్‌కు నూతన కార్యవర్గం



నియామక పత్రాలను అందజేస్తున్న అద్దంకి బాబు, కోటేశ్వరరావు మాదిగలు

నరసరావుపేట: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం టౌన్ హాలులో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) పట్టణ నూతన కమిటీని పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అద్దంకిబాబు మాదిగ, ఎంఎస్పీ అధ్యక్షులు కనుమూరి కోటేశ్వరావు మాదిగ సమక్షంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా కలపాల చరణ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా బుట్టి మహేంద్ర మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కాపా డానియల్ మాదిగ, కోశాధికారిగా కందుల రాజు మాదిగ, కార్యదర్శిగా పల్లపు శ్యామ్ మాదిగలను ఎన్నుకున్నారు. కార్యక్ర మంలో నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చిరుగూరి నాగరాజు మాదిగ, మల్లవర బాబు మాదిగ పాల్గొన్నారు.

1న సినిమా పాటల పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

మాచర్ల: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో జూన్ 1న సినిమా పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలసుబ్రహ్మణ్యం కళా పరిషత్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం పట్టణంలోని సవేరా లాడ్జి బజారులో ఉన్న మెడికల్ అసోసియేషన్ భవనంలో ఆయన మాట్లాడారు. 1న ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయన్నారు. 25 మంది గాయనీ గాయకులను ముగ్గురు న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎంపికైన గాయనీ గాయకులతో అదే రోజు సాయంత్రం 7 గంటలకు పోటీలు నిర్విహిస్తామని వివరించారు. కార్యక్రమానికి మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 10వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడవ బహుమతి రూ.5వేలు, నాలుగో బహుమతి రూ.4వేలు, 5వ బహుమతి రూ.3వేలతో పాటు ఎంపికైన మరో 20 మంది గాయనీ గాయకులకు రూ. వెయ్యి చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని వెల్లడించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్ ఖాన్, ఉపాధ్యక్షుడు బాహాటం శేషగిరి రాజు, సహాయ కార్యదర్శి పులుసు శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు పాల్గొన్నారు. వివరాలకు 9505453457, 9573786029, 9866537346 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమారి

రెంటచింతల: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చి అమలు చేయాలని చూస్తోందని, వెంటనే వాటిని రద్దు చేయాలని ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి డిమాండ్ చేశారు. రెంటచింతలలో సోమవారం కె.పుష్పలత అధ్యక్షతన జరిగిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇరవై ఏళ్లుగా పేదలకు ఆరోగ్య సేవలను అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించడం లేదని, చట్టబద్ధమైన సౌకర్యాలు కూడా అమలు చేయడం లేదని తెలిపారు. కుటుంబంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే సెలవలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ఆశా వర్కర్లతో ఊపిరి సలపకుండా 24 గంటలు పని చేయిస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగుగా మార్చి వారానికి 48 గంటల పని విధానాన్ని 90గంటలకు పెంచాలని చూస్తోందని ఆరోపించారు. దీన్ని ఖండిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశాలందరూ పాల్గొని, జయప్రదం చేయాలని ఆమె కోరారు.

నవరసభరితంగా సంగీత నాట్య పోటీలు

- ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు
- మూడోరోజు కొనసాగిన కళానిలయం జాతీయస్థాయి సంగీత నాట్యపోటీలు



ఆర్. దివ్యనందిని



పూర్వ వేదాంత్



మిట్ట రితీక్ష



దివ్య వర్మ

చిలకలూరిపేట: పురివిప్పిన నెమలిని తలపించే నృత్యాలు.. మనసును పులకింపచేసే కీర్తనలు.. సుమధుర గీతాలు... ఉర్రూతలూగించే జానపద నృత్యాల నడుమ కళానిలయం 40వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలు సోమవారం మూడో రోజు కొనసాగాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆర్య వైశ్య కల్యాణ మండపంలో కొనసాగుతున్న ఈ పోటీలలో చివరిరోజు వివిధ అంశాలలో కళాకారులు ఉత్సాహంగా పాల్గొని కళారూపాలను ప్రదర్శించారు. మూడో రోజు పోటీలను కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణి శివ సత్యనారాయణమ్మ నటరాజపూజ చేసి ప్రారంభించారు. సూర్య, చంద్ర విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో జానపద నృత్యాలతో పాటు శాస్త్రీయ బృంద నాట్యాలు, శాస్త్రీయ జంటనాట్యాలు, శాస్త్రీయం కాని జంట నాట్యాలు, శాస్త్రీయ కాని బృంద నాట్యాలు, శాస్త్రీయ నృత్య నాటికలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తుమ్మెదలున్నాయేమిరా, చిరుత ముత్తి, పారే గోదావరి, నా పేరు మల్లిగాడు, పోమతి పొన్నమ్మ, ఓరి మగడా, మొక్కజొన్న చేనులో వంటి జానపద నృత్యాలతో పాటు, శ్రీకృష్ణ తరంగిణి, సారూప్యం, దేవీ స్తుతి, కాళింగ నర్తనం, శ్రీకృష్ణలీలలు, గోవర్ధనం వంటి బృంద నాట్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా జానపద నృత్యాలు రసజ్ఞులైన ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఈ సందర్భంగా నాట్యాచార్యులకు సన్మానాలు చేశారు. ప్రేక్షకులు ఆసక్తిగా ప్రదర్శనలను వీక్షించారు.

డీ అడిక్షన్ సెంటర్‌కు స్థలం ఎంపిక

ప్రభుత్వ హాస్పిటల్‌లో పరిశీలించి నిర్ధారించిన అధికారులు



హాస్పిటల్‌లో పర్యటిస్తున్న డాక్టర్ ప్రసూన, డాక్టర్ లక్కిరెడ్డి

నరసరావుపేట: కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో మత్తు వ్యసన విముక్తి కేంద్రం (డీడీసీఏ) ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సోమవారం పరిశీలించి, ఎంపిక చేశారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ప్రసూన, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి , హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.సురేష్‌కుమార్‌తో డీఅడిక్షన్ సెంటర్ స్థాపన కోసం అన్ని ప్రమాణాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న అనుకూలమైన స్థలం రెండవ అంతస్తులో గుర్తించి నిర్ధారించారు. మత్తు వ్యసన సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు సమగ్ర వైద్యసేవలు అందించేందుకు త్వరలో సెంటర్ ఏర్పాటు చేస్తామని చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం, సమీప ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడానికి కీలకంగా ఉంటుందని చెప్పారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన జంపని వీరవసంతరావు రూ.51,116 విరాళంగా అందించారు. ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజల అనంతరం నగదును కమిటీ అధ్యక్షుడు వజ్ఞా వీరాంజనేయులుకు అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, రామారావు, సీతయ్య, నర్రా శ్రీనివాసరావు, వెంకట సుబ్బారావు, గొర్రె సాంబశివరావు ఉన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో సోమవారం పలు రేషన్ షాపుల్లో తహసీల్దార్ ఏవీ రమణ తనిఖీలు చేశారు. వీఆర్వో వెంకటరమణతో కలిసి రేషన్ షాపుల్లో నిల్వలు పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎండీఎం వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిందని, వచ్చే నెల 1వ తేదీ నుంచి కార్డుదారులు రేషన్‌షాపునకు వచ్చి సరుకులు తీసుకోవాలన్నారు. బియ్యాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని, డీలర్లకు అమ్ముకోవద్దని ఆయన సూచించారు.